సాక్షి
అనంతపురం
సోమవారం ၊ 6 ၊ జనవరి ၊ 2025



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆకుపచ్చని బంగారం

వెదురు సాగు కాసులు కురిపిస్తోంది. ఓ రైతు ఇంట వెలుగులు నింపుతోంది. గ్రామీణ పేదలకు విరివిగా ఉపాధి కూడా కల్పిస్తోంది.

8లో



జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు శింగనమలలో 'పరిష్కార వేదిక'

- కలెక్టరేట్‌లో ఉండదు



అనంతపురం అర్బన్: కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను సోమవారం శింగనమల నియోజక వర్గ కేంద్రంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఇన్‌చార్జ్ వాణిశ్రీ తెలిపారు. కలెక్టరేట్‌లో కార్యక్రమం ఉండదన్నారు. శింగనమల తహసీల్దారు కార్యాలయంలో జరగనున్న 'పరిష్కార వేదిక'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

జిల్లా అండర్-12 క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: నగరంలో ఆదివారం జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా కమలాకర్ నాయుడు, సభ్యులుగా ఎస్ఎల్ఎన్ ప్రసాద్, ఎం. భార్గవ్ ఉన్నారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు కడపలో జరగనున్న సౌత్ జోన్ మ్యాచ్‌లో ఈ జట్టు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వారు తెలిపారు.

జట్టులో చోటు దక్కించుకున్న వారు..

హవీష్ రెడ్డి, ఏ. హేమచంద్రా నాయక్, జి. ధనుష్, జై వీర్ రెడ్డి, ఎం. తమోఘ్న, లలిత్ కిశోర్, రోహితేశ్వర రాజు, చరణ్ తేజ్ (అనంతపురం), రామ్ చరణ్ (హిందూపురం), బి. ఉత్తేజ్ యాదవ్, ఎస్కే ఇస్మాయిల్ (గుంతకల్లు), బీఎం మోక్షజ్ఞ తేజ (కళ్యాణదుర్గం), టి. గణేష్ (ధర్మవరం),బృందావన్, ఎస్. వెంకట లిఖిత్ రెడ్డి (తాడిపత్రి), స్టాండ్ బై (కుషాల్ రాయల్, అనంతపురం), క్రమణ్ ఫహద్ (హిందూపురం), మన్నన్ లలిత్ సాయి (అనంతపురం), ఎం. రాజా (ధర్మవరం), బి. ప్రజ్వల్ (నార్పల).

వస్తారు.. వెళ్తారు!

- నామ్‌కేవాస్తుగా సాగనున్న కేంద్ర బృందం పర్యటన



అనంతపురం అగ్రికల్చర్: కరువు పరిస్థితులు ప్రత్యక్షంగా తెలుసుకునే నిమిత్తం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) ఈనెల 8న జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తోంది. 46 మండలాల రైతులకు అన్యాయం చేస్తూ కూటమి సర్కారు తూతూ మంత్రంగా ఉమ్మడి జిల్లా పరిధిలో కేవలం 17 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించగా... అందుకు తగ్గట్టుగానే కేంద్ర బృందం పర్యటన నామ్‌కే వాస్తు అన్నట్లుగా సాగనుంది. ఈనెల 8న మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లాలో ప్రారంభం కానున్న బృంద సభ్యుల పర్యటన.. సాయంత్రం 5 గంటలకే పూర్తి కానుండటం గమనార్హం. ఈ మేరకు ఆదివారం వ్యవసాయ శాఖ అధికారులు రూట్‌మ్యాప్ విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండలం మన్నీలతో పాటు రాప్తాడులో సభ్యులు పర్యటిస్తారు. మరోవైపు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా కేవలం నాలుగు గంటలే కేంద్ర బృందం పర్యటన సాగనుంది.



- రాప్తాడు నియోజకవర్గంలో ముఖ్యనేత కుమారుడి లీలలు
- పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి వసూళ్లు
- రూ. 2 కోట్లు ఇవ్వాలని ఓ బిల్డర్‌కు బెదిరింపులు
- రూ. 3 కోట్లు ఇవ్వాలని ఇంకో రియల్టర్‌కు డిమాండ్
- తాము టీడీపీ వాళ్లమన్నా కుదరదని తెగేసి చెప్పిన వైనం
- ఇప్పటికే మట్టి, గ్రావెల్ మాటున యథేచ్ఛగా దోపిడీ



చిన్నోడే..

దందాల్లో చాలా పెద్దోడు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాప్తాడు నియోజకవర్గంలో ఓ ముఖ్య నేత కుమారుడు డాన్‌లా వ్యవహరిస్తూ దోపిడీ రాజ్యానికి తెరతీశాడు. రాప్తాడుకు చెందిన కీలక నేత చిన్న కుమారుడు కూటమి సర్కారు కొలువుదీరిన రోజు నుంచే పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య వర్గాలపై పడ్డాడు. ప్రతి వారినీ పిలిపించుకొని ఎంత ఇవ్వాలో చెబుతున్నాడు. ఇవ్వని వారి వ్యాపారం మూతపడినట్లే. ఎదురు తిరిగిన వారిని తొక్కుకుంటూ వెళతామని బెదిరిస్తున్నాడు. ఇప్పటికే నియోజకవర్గంలోని సహజ సంపద ఇతని కనుసన్నల్లో తరలిపోతోంది. ముఖ్యంగా కృష్ణంరెడ్డి పల్లి సమీపంలోని గుట్టలు కొల్లగొట్టారు. గ్రావెల్, మట్టిని వందల లోళ్ల తరలించి సొమ్ము చేసుకున్నా మైనింగ్ అధికారులు కిమ్మనలేదు. తాజాగా రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులపై వసూళ్ల దందాకు దిగారు.

డబ్బులిస్తారా.. పనులు ఆపేయాలా?!

'ఇక్కడ మాదే రాజ్యం. మేము ఎంత చెబితే అంత. రూల్సు గీల్సూ ఉండవు. అధికారుల నుంచి అన్ని అనుమతులున్నా మా అనుమతి ఉండాల్సిందే' అంటూ ఆయన దందా చేస్తున్నారు. అనంతపురం శివారులోని ఓ బిల్డర్ రెండు చోట్ల అపార్ట్‌మెంట్లు కట్టాడు. ఇటీవల ఆయన్ను పిలిపించి రూ.2 కోట్లు డిమాండ్ చేసినట్టు తెలిసింది. 'ఫ్లాట్‌లు అమ్ముడుపోక ఇబ్బందుల్లో ఉన్నా'నని బిల్డర్ చెప్పినా వినలేదు. డబ్బు ఇవ్వకపోతే ఫ్లాట్‌లు అమ్ముకోలేరని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో చివరకు రూ. కోటి ముట్టజెప్పి సెటిల్ చేసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అనంతపురం నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోని హంపాపురం వద్ద ఐదుగురు కలిసి 9 ఎకరాల్లో విల్లా కోసం వెంచర్ వేశారు. వీరిని కొన్ని రోజుల క్రితం చిన్నోడు పిలిపించి రూ.3 కోట్లు డిమాండ్ చేసినట్టు బాధితులు వాపోయారు. మూడు దఫాలు తన మనుషులను పంపించి పనులను ఆపించడంతో చివరకు వారు వెళ్లి కలిశారు. 'మేం గతంలో మీ నాన్న దగ్గర పని చేశాం. మేం కూడా టీడీపీకి చెందిన వారమే' అని వారు చెప్పుకున్నా.. 'అది అదే, ఇది ఇదే..'అనడంతో కంగుతిన్నారు. ఇప్పటివరకూ ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని, డబ్బులు ఇవ్వలేమని చెప్పగా.. వెంటనే అతని అనుచరులు తమ వద్ద ఉన్న డైరీ తీసి 9 రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, ఆ విల్లాలు కొన్న వారి పేర్లతో సహా చెప్పడంతో వారికి మతిపోయినంత పనైంది. దీన్నిబట్టి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ ఎక్కడెక్కడ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే సమాచారం ఎప్పటికప్పుడు చిన్నోడికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు కూడా కొంత ముట్టజెప్పడంతో శాంతించారు.

పెట్టుబడులకు వెనకడుగు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్న నియోజకవర్గాల్లో రాప్తాడు ఒకటి. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి సమీపంలో ఉండటంతో గతంలో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నేత కుమారుల దెబ్బకు పెట్టుబడులు పెట్టే నాథులే కరువయ్యారు. వచ్చిన వారు కూడా ఆమడ దూరం పారిపోయారు. గడిచిన ఏడు నెలల్లో ఒక్క చిన్న పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 'చిన్న రేకుల షెడ్డు వేసుకుని, ఏదైనా వ్యాపారం పెట్టుకున్నా వసూళ్లకు వస్తుంటే ఇక ఇక్కడ ఎందుకు పెట్టుబడి పెట్టాలి' అని జిల్లాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త వాపోయారు. దీనికితోడు నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీ నాయకులపై దాడులు, భూ ఆక్రమణలు షరా మామూలుగా మారడంతో సామాన్యులు కూడా భయకంపితులవుతున్నారు.



రాప్తాడు పరిధిలో ఎక్కడ ఇలాంటి లే అవుట్ వేయాలన్నా చిన్నోడు అడిగినంత ఇవ్వాల్సిందే..

సంతల్లో వసూళ్ల పర్వం

- ఎమ్మెల్యే పేరిట నిలువుదోపిడీ



అనంతపురం మార్కెట్‌యార్డు ప్రాంగణంలో పశువుల సంత

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో వసూళ్ల పర్వం సాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కొందరు ప్రబుద్ధులు దందాకు తెరలేపారు. మార్కెట్ యార్డులో ప్రతి శని, ఆదివారం జరిగే జీవాలు, పశువుల సంతను పలువురు 'పచ్చ' నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ దోచేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడుతో పాటు ఇతర జిల్లాలకు జీవాలు, పశువులు తరలిస్తున్న క్రయ విక్రయదారులు, వాహనదారులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పంచుకోవడంలో తేడాలొచ్చి బాహాబాహీకి దిగుతున్నారు. ఇటీవల మార్కెట్ ప్రాంగణంలో ప్రైవేట్ వ్యక్తులు పరస్పరం గొడవకు దిగిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇక.. 'పచ్చ' నేతలతో పాటు మున్సిపాలిటీ వాళ్లమంటూ కొందరు, పోలీసు వాళ్లమంటూ ఇంకొందరు, మీడియా వాళ్లమంటూ మరికొందరు ఇష్టారాజ్యంగా డబ్బులు లాగుతుండటంతో రైతులు, వ్యాపారులు, వాహనదారులు, జీవాల పెంపకందారులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత మార్కెట్ యార్డు సంతల్లో 'బాదుడు'కు దిగింది. గతంలో ఒక్కో గొర్రెకు వసూలు చేసే రుసుం రూ.30 నుంచి రూ.50కు, ఒక్కో పశువుకు రూ.100 నుంచి రూ.200 ప్రకారం పెంచింది. సర్కారు చర్యలతో ఇప్పటికే ఇబ్బంది పడుతుండగా.. ఈ నేపథ్యంలోనే కొందరు వసూళ్లకు తెరతీయడంతో సంతలకు వచ్చే వారు అల్లాడిపోతున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెట్‌కమిటీ అధికారులు,సిబ్బంది చోద్యం చూస్తుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

అనంత వెంకటరెడ్డి చిరస్మరణీయులు

- రాయలసీమకు కృష్ణా జలాల మళ్లింపులో విశేష కృషి
- మాజీ ఎంపీ వర్ధంతి కార్యక్రమంలో కొనియాడిన వక్తలు



అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల్లో గెలిచినా, ఓడినా వివాదాలకు తావివ్వకుండా ప్రజా సేవే పరమావధిగా పనిచేసిన మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. అనంత వెంకటరెడ్డి 25వ వర్ధంతిని ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహానికి నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఆస్పత్రి ఎదుట అన్నదానం చేశారు. అలాగే, బుక్కరాయ సముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద అనంతతో పాటు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్, రజక కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న తదితరులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ నదీ జలాల విషయంలో అనంత వెంకటరెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అందుకే దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో హంద్రీనీవాకు అనంత వెంకటరెడ్డి పథకంగా నామకరణం చేశారని గుర్తు చేశారు. టీడీపీ నేతలు కక్షపూరితంగా ఆయన పేరు తొలగించినా, ప్రజల గుండెల్లో నుంచి మాత్రం తొలగించలేరని స్పష్టం చేశారు.

కృష్ణా జలాల మళ్లింపులో కీలకపాత్ర

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణా జలాల మళ్లింపులో మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. 'హంద్రీనీవా'కు ఉన్న అనంత వెంకటరెడ్డి పేరును కూటమి ప్రభుత్వం తొలగించడం బాధాకరమన్నారు. దివంగత నేత వైఎస్సార్ చలవతోనే 2012 నుంచి కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయన్నారు. హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు తీసుకురావాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే అందుకు సంబంధించి జీఓ విడుదల చేశారని, కానీ, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అనంత వెంకటరెడ్డి చొరవతోనే జిల్లాకు న్యాయం జరిగిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంలో అనంత వెంకటరెడ్డి అప్పట్లో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్ గౌడ్, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర తదితరులు మాట్లాడారు.

షీప్ సొసైటీ ఎన్నికలకు వేళాయె



అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల ప్రాథమిక పరపతి సహకార సంఘాల (షీప్ సొసైటీ) ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. జిల్లాలో 121 సొసైటీలు ఉండగా, మొదటి విడతగా ఈనెల 7న మంగళవారం 36 సొసైటీలకు ఎన్నికలు జరిపేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రెండో విడతగా ఈనెల 18న, మూడో విడత కింద 25న, చివరి విడతగా ఫిబ్రవరి 5న ఎన్నికలు నిర్వహించనున్నారు. సొసైటీ పరిధిలో 7 డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. వీరి పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది. సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న పశువైద్యుల ఆధ్వర్యంలోనే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రాథమిక సంఘాల ఎన్నికలు పూర్తయ్యాక జిల్లా కమిటీ ఎన్నిక ఉంటుందని వివరించారు. కాగా జిల్లాలోని అన్ని షీప్ సొసైటీలను దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీకి ఒక్కటి కూడా దక్కకుండా పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

రేపు ఎన్నికలు జరగనున్న సొసైటీలు..

పూలకుంట, కాటికానికాలువ, ఆత్మకూరు, పి.సిద్ధరాంపురం, వడ్డుపల్లి, రంగంపేట, వేపచెర్ల, అమ్మవారుపేట, బుక్కరాయసముద్రం, నీలారెడ్డిపల్లి, హనిమిరెడ్డిపల్లి, బొమ్మనహాళ్, సోమలాపురం, ముకుందాపురం, అబ్బేదొడ్డి, బ్రాహ్మణపల్లి, గోనబావి, నాగసముద్రం, ముదినాయనిపల్లి, ఎం.వెంకటంపల్లి, బాలవెంకటాపురం, హనకనహాల్, యల్లచింతల, బండ్లపల్లి, మంగపట్నం, నరసాపురం, పులసలనూతల, కట్టకిందపల్లి, పెద్దపప్పూరు, కొండుపల్లి, అరకటివేముల, ఎం.చెర్లోపల్లి, వజ్రహొన్నూరు, సోదనపల్లి, నింబగల్, పీసీపీ కొత్తకోట.

రెండో విడత: క్రిష్ణమరెడ్డి, కామారుపల్లి, కుర్లపల్లి, ఎంజీ తండా, బి.యాలేరు, గొరిదిండ్ల, బద్రంపల్లి, చెన్నంపల్లి, సిద్ధరాంపురం, దుద్దేకుంట, బొల్లనగుడ్డం, పి.కొత్తపల్లి, కొత్తపేట, గొల్లపల్లి, నక్కలదొడ్డి, గరుడాపురం, పాలవాయి, మానిరేవు, ఈస్ట్‌కోడిపల్లి, ఆదిగానిపల్లి, జెల్లిపల్లి, కుందుర్పి, బొందలవాడ, గడ్డంనాగేపల్లి, నార్పల, నాయనిపల్లి, కాలాపురం, తురకపల్లి, కడవకల్లు, రాప్తాడు, పాలచెర్ల, 74 ఉడేగోళం, చిన్నమట్లగొంది, రాకెట్ల, పందికుంట, పీసీ ప్యాపిలి.

మూడో విడత: జంగాలపల్లి, ముట్టాల, తలుపూరు, సనప, తోపుదుర్తి, మదిగుబ్బ, బి.కొత్తపల్లి, దండువారిపల్లి, జంతలూరు, ఉంతకల్, పెనకచెర్ల, గొందిపల్లి, తాళ్లకెరె, పాతకొత్తచెరువు, కాపర్లపల్లి, సీబాయి, తిమ్మసముద్రం, విట్లంపల్లి, వైసీ పల్లి, మాల్యాం, మరుట్ల-1, రుద్రంపల్లి, బి.పప్పూరు, హెచ్.సోదనపల్లి, నడిమిదొడ్డి, రంగాపురం, గూగూడు, గజరాంపల్లి, యర్రగుంట్ల, గొందిరెడ్డిపల్లి, వెస్ట్ నరసాపురం, ఇగుడూరు, లత్తవరం, దొనేకల్లు, యాడికి.

నాలుగో విడత: దోసలుడికి, గొల్లాలదొడ్డి, సొరకాయలపేట, ఖాదర్‌పేట, పాలెంతండా, ఓబులాపురం, చెర్లోపల్లి, బండమీదపల్లి, ఉరవకొండ, వీపీ తండా, రాగులపాడు, హావలిగి, పాల్తూరు, బుక్కాపురం.

పింఛన్లకు ఎసరు!

- చంద్రబాబు సర్కారు కుట్ర
- పరిశీలన పేరుతో కుతంత్రం
- ఆందోళనలో లబ్ధిదారులు

అనంతపురం క్రైం: పింఛన్‌దారుల పొట్ట కొట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పరిశీలన పేరుతో ఎసరు పెట్టేందుకు కసరత్తు ప్రారంభిస్తోంది. పింఛన్ డబ్బుతో ప్రతి నెలా వైద్య ఖర్చులు, ఇతర అవసరాలు తీర్చుకుంటున్న దివ్యాంగులు, దీర్ఘకాలిక జబ్బుల బారిన పడిన వారిని లక్ష్యం చేసుకుంది. మెడికల్ టీంలను ఇంటి వద్దకే పంపి వడపోత పట్టాలని ఆదేశాలు చేసింది. సర్కారు చర్యలతో జిల్లాలోని లబ్ధిదారులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ పింఛన్లు పొందుతున్న వారితో పాటు దివ్యాంగ పింఛన్లు జిల్లాలో 2,499 ఉన్నాయి. జనవరి 6 (నేడు) నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకూ ఆయా లబ్ధిదారుల పత్రాలను అధికారులు తనిఖీ చేయనున్నారు. నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి పరిశీలించనున్నారు. అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో ఇంటి వద్ద లేకపోతే పింఛన్ నిలిపివేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఈ క్రమంలో కూటమి సర్కారు కుట్రలపై పింఛన్‌దారులు మండిపడుతున్నారు. ఆరోగ్యం సరిగా లేని తాము వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని, ఆ సమయంలో ఇంటి వద్దకు వచ్చి తొలగిస్తామంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో అన్ని వివరాలు సమగ్రంగా పరిశీలించాకే పింఛన్ మంజూరు చేశారని గుర్తు చేస్తున్నారు. కానీ, ఇప్పుడు పరిశీలన పేరుతో అవమానించడం తగదని స్పష్టం చేస్తున్నారు.

నేత్రపర్వం.. బ్రహ్మ రథోత్సవం



మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న అర్చకుడు

- నాగలమడక సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మ రథోత్సవానికి పోటెత్తిన జనం

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం పావగడలో నేత్రపర్వంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణలతో మూల విరాట్ ఏడు పడగల సర్పాకార అంత్య సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాల షోడశ ఉపచార పూజలు, పంచామృతాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం తదితర పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని తీసుకొచ్చి బ్రహ్మరథంలో ప్రతిష్ఠించారు. వంట శాలలో అన్నం రాశిపై నాగదేవతను ఉంచగా ఆ అన్నం రాశి రెండుగా చీలింది. ఒక వైపు బ్రాహ్మణులకు, మరో వైపు రాశి భక్తులకని ప్రతీతి. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తులు అరటి పండ్లను రథం మీదికి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎండోమెంట్ అధికారి ఏసీ గోటూరు శివప్ప, తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్ లాంఛనప్రాయంగా రథాన్ని లాగారు. భక్తులు రథానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం రథం యథాస్థానానికి చేరుకుంది.



అన్నం రాశి చీలిన దృశ్యం



భక్త జనం మధ్య సాగుతున్న బ్రహ్మ రథోత్సవం

క్లుప్తంగా

భార్య ఎడబాటు తట్టుకోలేక భర్త ఆత్మహత్య


నారాయణస్వామి (ఫైల్)

పెద్దపప్పూరు: భార్య మృతితో ఎడబాటును తట్టుకోలేక చివరకు భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లికి చెందిన నారాయణస్వామి (38), లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో 28 రోజుల క్రితం క్రిమి సంహారక మందు తాగి లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి దిగాలుగా ఉన్న నారాయణస్వామి శనివారం అర్ధరాత్రి కలుపు నివారణ మందు తాగాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు చికిత్సకు స్పందించక ఆదివారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అదనపు కట్న వేధింపులపై కేసు నమోదు

గార్లదిన్నె: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త, ఆయన తండ్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలు.. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన కావ్యశ్రీకి ఏడాది క్రితం కళ్యాణదుర్గం షీబావి నివాసి వన్నూరుస్వామితో వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం కోసం కావ్యశ్రీని భర్తతో పాటు మామ కుళ్లాయప్ప వేధిస్తుండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేశారు.

'చాగల్లు' గేట్ల ఎత్తివేత

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువన పెన్నాకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ మేరకు హెచ్చెల్సీ జేఈ హరి ఆదివారం తెలిపారు.

జాతీయ స్థాయి టోర్నీలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఢిల్లీలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ టోర్నీలో అనంతపురం నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ జట్టు తరపున షేక్ దాదాపీర్ షాకీర్‌బాషా (విద్యాశాఖ), పి. సాయి తరుణ్‌రెడ్డి (ఇంజినీరింగ్ అసిస్టెంట్), సెంట్రల్ డిపార్ట్‌మెంట్ రీజినల్ స్పోర్ట్స్ బోర్డు హైదరాబాద్ జట్టు తరపున సతీష్ కుమార్ (ఆదాయ పన్నుశాఖ), వెంకటరెడ్డి (కస్టమ్స్) ఆడుతున్నారు. ఈ నెల 7న ఈ రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌లో తలపడనున్నాయి.

చిన్న, సన్నకారు రైతుల జీవితాల్లో వెలుగులు నింపే సామర్థ్యమున్న ఆకుపచ్చని బంగారం అది. సారవంతం లేని భూమైనా పర్వాలేదు.. గ్యారంటీగా పంట పండుతుంది. రైతులకు కాసుల వర్షం కురిపిస్తుంది. రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే పంటగా గుర్తింపు పొందిన ఆ పంటే వెదురు సాగు. గ్రామీణ పేదలకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించే వనరు కూడా వెదురే కావడం గమనార్హం. వెదురు వినియోగం పెరిగే కొద్ది మార్కెట్‌లో దాని విలువ బంగారంతో సమానంగా ఎగబాకుతోంది. అందుకే దీనిని 'గ్రీన్ గోల్డ్' (ఆకుపచ్చని బంగారం)గా ముద్దుగా పిలుస్తుంటారు. స్వల్ప పెట్టుబడితో దీర్ఘకాలిక ఆదాయం పొందే ఈ పంటపై ఓ చిరుద్యోగి దృష్టి సారించి సఫలీకృతుడయ్యారు. సాగు ఆరంభంలో అందరూ నవ్వుకున్నా... పట్టు వీడని విక్రమార్కుడిలా సత్ఫలితాలు సాధించారు. అందరి చేత శభాష్ అనిపించుకున్నారు.


గొల్లపల్లి వద్ద వెదురు సాగు

రైతు పాటిల్ వంశీకృష్ణారెడ్డి

ఆకు పచ్చని బంగారం!

- కోతకొచ్చిన వెదురు సాగు
- ఆరంభంలోనే అధరహో
- ఎకరాకు 15 నుంచి 20 టన్నుల దిగుబడి
- తోట వద్దకే క్యూ కడుతున్న వ్యాపారులు

రాయదుర్గం: జిల్లాలో వెదురు సాగు రైతు అంటూనే ఠక్కున గుర్తొచ్చేది గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన పాటిల్ వంశీకృష్ణారెడ్డి. జిల్లాలో తొలిసారి వెదురు సాగుకు శ్రీకారం చుట్టి అటు ఉద్యానశాఖ అధికారుల్లో, ఇటు అన్నదాతల్లో ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన బళ్లారిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగిగా స్థిరపడ్డారు. కరోనా కారణంగా ఉద్యోగం వీడి వ్యవసాయంపై దృష్టి సారించారు. అందరిలా వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, పత్తి లాంటి పంటలు కాకుండా వినూత్న ఆలోచనతో 10 ఎకరాల్లో వెదురు సాగు చేపట్టారు. ఎకరాకు రూ.50 వేలు చొప్పున రూ.5 లక్షలు పెట్టుబడి అయింది. మూడేళ్ల పాటు పంటను కాపాడుతూ వచ్చారు. ఇది చూసిన చాలా మంది హేళనగా మాట్లాడారు. అయినా ఆయన వెనుదిరిగి చూడలేదు.

మూడేళ్ల తర్వాత కోతలు..

వంశీకృష్ణారెడ్డి సాగు చేసిన వెదురు పంట మూడేళ్ల తర్వాత ప్రస్తుతం కోతకు వచ్చింది. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో టన్ను వెదురు ధర రూ.6 వేలు పలుకుతోంది. నాణ్యమైన వెదురు కావడంతో వంశీకృష్ణారెడ్డి పొలం వద్దకే కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ధర పెంచేందుకు కూడా వెనుకాడడం లేదు. సరాసరి ఎకరాకు 20 టన్నులతో పదెకరాలకు 200 టన్నులకు పైగా దిగుబడి వచ్చింది. టన్ను రూ.6 వేలతో లెక్కించినా రూ.12 లక్షల ఆదాయం ఇంటి వద్దకే సమకూరింది. వచ్చే ఏడాది 25 నుంచి 30 టన్నులు, ఐదో ఏడాది 45 నుంచి 50 టన్నులకుపైగా దిగుబడి వస్తుందని రైతు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి పంట కోతలు చేపడితే.. ఆ తర్వాత కేవలం నీటి తడులతోనే పంట ఏపుగా పెరుగుతుందని పేర్కొంటున్నారు. పైగా కోత దశకు వచ్చిన వెదురు పంటలో వ్యర్థమన్నదే ఉండదంటున్నారు. చిన్న పరిమాణంలో ఉన్న వెదురు కర్రలకు సంబంధించి టన్ను రూ.5వేలకు పైగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. వీటిని టమాట, ఇతర పంటల సాగులో ఊతకర్రలుగా వినియోగిస్తుంటారు.


మొదటి ఏడాది వెదురు సైజు ఇలా


కోత కోసిన తర్వాత కొలతలు తీస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉన్నాయి..

సాగుకు యోగ్యంగా లేని భూములైన సరే నీటి వసతి ఉంటే వెదురు సాగుకు అనుకూలం. వెదురు సాగుతో మిగిలిన రైతులకు వంశీకృష్ణారెడ్డి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం గుంతకల్లు మండలం నక్కదొడ్డిలో ఇద్దరు రైతులు ఎనిమిది ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు. వెదురు సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందజేస్తాం. ఎకరం పది సెంట్లలో నర్సరీ ఏర్పాటు చేసుకుంటే రూ.10 లక్షలు ఇస్తాం. వెదురు మొక్కలు రాయితీతో అందించడంతో పాటు ప్రధాన పంటగా సాగు చేస్తే హెక్టారుకు రూ.50 వేలు చెల్లిస్తాం. కంచె పంటగా సాగు చేస్తే రెండు మీటర్లకు ఒక మొక్కకు రూ.25 చొప్పున రాయితీ ఉంటుంది. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్లకు ప్రోత్సాహకాలు అందించేలా మార్గదర్శకాలు ఉన్నాయి.

– నరసింహారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అనంతపురం

ఎంపీఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్


ఎంపీఈఓల సంఘం జిల్లా నూతన కమిటీ

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో పనిచేస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈఓ) సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెడ్డి ప్రసాద్ ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో రాష్ట్ర కమిటీ నాయకులు ఎం.నాగరాజు అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్, ఉపాధ్యక్షురాలుగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మోహన్‌నాయక్, అదనపు ప్రధాన కార్యదర్శిగా రాజ్యలక్ష్మి, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, సలహాదారుగా భాస్కర్‌నాయక్, జాయింట్ సెక్రటరీలుగా శివకుమార్, లక్ష్మీనారాయణ, ముత్యాలు, కోశాధికారిగా తిరుపతి, అదనపు కోశాధికారిగా ఉరవకొండ నాగరాజు, కమిటీ సభ్యులుగా గంగన్న, హేమ, లోకేష్, హిమబిందు, నరసింహులు, సుధాకర్, గోలికొండ, అశ్విని, ప్రశాంతి, రమేష్, మోహన్‌నాయక్, గంగాభవానీ ఎన్నికయ్యారు. ఎంపీఈఓలు చాలీచాలని జీతాలు, ఉద్యోగ భద్రత, ఎలాంటి సదుపాయాలు లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎంపీఈఓల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి తీసుకెళ్లేలా చర్యలు చేపడతామని తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



తాడిపత్రి రూరల్: మండలంలోని కోమలి సమీపంలో రైలు కింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో కో–పైలెట్ సమాచారంతో ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ వరప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో తాడిపత్రిలోని రైల్వే స్టేషన్ నుంచి గుత్తికి వెళ్లే రైలుకు కొనుగోలు చేసిన టికెట్ లభ్యమైంది. అంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

చిరుత దాడిలో దూడల మృతి

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మంజునాథ్ సినియా థియేటర్ సమీపంలో ఉన్న వ్యవసాయ తోటలో రైతు రాజన్న కట్టేసిన రెండు ఆవు దూడలపై శనివారం రాత్రి చిరుత హతమార్చి సగానికి పైగా తినేసింది. ఆదివారం ఉదయం విషయాన్ని గుర్తించిన బాధిత రైతు సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొంతకాలంగా పట్టణ శివారు ప్రాంతాల్లోకి చిరుత సంచారం ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరారు.

రంగారెడ్డి జిల్లా వాసి దుర్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ఆదివారం చోటు చేసుకున్న ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా షామీర్‌పేట్ మండలం లాల్గాడి మలక్‌పేట్‌కు చెందిన సయ్యద్ రహంతుల్లా కుమారుడు శిబ్బతుల్లా (36) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తన మామ సయ్యద్ యాసీన్, బామ్మర్ది సయ్యద్ హయ్యాత్ షాహెగ్గర్‌తో కలసి కారులో బెంగళూరుకు శిబ్బతుల్లా బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున పెద్దవడుగూరు మండలం కాశేపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే కారు టైర్ పంఛర్ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి టైర్ మార్చుకున్నారు. అనంతరం కారు ఎక్కుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో శిబ్బతుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే పామిడిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

బోనులో కొండముచ్చు

పుట్లూరు: వారం రోజులుగా పుట్లూరు మండలం సంజీవపురం, ఓబుళాపురం గ్రామాల ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన ఓ కొండముచ్చు ఎట్టకేలకు బోనులో బందీ అయింది. పొలాలకు వెళుతున్న సమయంలో వెంటబడి తరుముతుండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు బెంబేలెత్తిపోయారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదులపై స్పందించిన అటవీశాఖ అధికారులు ఎస్.బి.జగన్నాథం, వెంకటరమణ, సిబ్బంది కొండముచ్చు కదలికలను పరిశీలించి ఆదివారం బోను ఏర్పాటు చేసి, బంధించారు.




అ'పూర్వ' కలయిక


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు సావిత్రమ్మ, రామాంజిరెడ్డిను ఘనంగా సత్కరించారు.

హామీలు నిలబెట్టుకోవాలి : ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న రఘురామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సౌలభ్యాలకు తక్షణమే పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు. లేకుంటే ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, నాయకులు బి.వెంకటేశులు, నాగరాజు, మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, బొమ్మయ్య, చెన్నకేశవులు, సర్దార్‌వలి, రమణ, తలారి కృష్ణ, వన్నప్ప, గురురాజు పాల్గొన్నారు.

ఈడిగలు రాజకీయశక్తిగా ఎదగాలి

- శివ సాయిబాబా, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు బీసీ రమేష్‌గౌడ్


ఐక్యత చాటుతున్న ఈడిగ (గౌడ) కులస్తులు

రాప్తాడురూరల్: ఐక్యమత్యంగా ఉంటూ రాజకీయ శక్తిగా ఎదగాలని ఈడిగ కులస్తులకు శివసాయిబాబా, వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు బీసీ రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం రాయల్‌నగర్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ ఆలయ కల్యాణమంటపంలో ఈడిగ (గౌడ) సంక్షేమ సంఘం, రేణుకా యల్లమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. రేణుకా యల్లమ్మ సొసైటీ అధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర కుమార్ గౌడ్, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన శివసాయిబాబు, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ... ఈడిగ కులస్తులు పూర్వం నుంచి కులవృత్తి కల్లుగీతతో జీవనం సాగిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా పిల్లలను చదివిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. కులస్తుల అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈడిగ సంక్షేమ సంఘం, రేణుకా యల్లమ్మ సొసైటీ సభ్యులు ఆదినారాయణ, రాజు, కుళ్లాయిస్వామి, చంద్ర, రఘురామయ్య, నారాయణస్వామి, బలరాం, గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు విశ్వనాథ్, మనోహర్, రవీంద్ర, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కుందుర్పి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన సాగిస్తోందని రామకృష్ణ మండిపడ్డారు. కుందుర్పి మండలం బెస్తరపల్లిలో సీపీఐ శతవసంతోత్సవ వేడుకల అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో సినీ నిర్మాతలు, హీరోలకు రూ.వందల కోట్లు దోచిబెట్టేలా సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీనిచ్చి అధికారం చేపట్టిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరుతో పెనుభారం మోపారని మండిపడ్డారు. నానా కష్టాలు పడి అరకొర దిగుబడి సాధించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. అనంతరం బెస్తరపల్లిలో సీపీఐ అమరుల స్థూపం, సీపీఐ కార్యాలయం, గ్రంథాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. 1950 నాటి చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని విప్లవయోధులను స్మరిస్తూ బెస్తరపల్లిలో 130 మంది అమరుల పేర్లను లిఖిస్తూ స్థూపాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఎండీ సంజీవప్ప, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి స్థానిక నాయకులు బీకే గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు తగ్గించడం దారుణం


మాట్లాడుతున్న రాంభూపాల్

గుత్తి: హంద్రీ–నీవా కాలువ వెడల్పును తగ్గించి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని కుదిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ మండిపడ్డారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం 6,400 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంతో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో పనులు ముందుకు కదల్లేదన్నారు. ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి సర్కార్ గత ప్రభుత్వ ప్రతిపాదిత పనులను అటకెక్కించి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 3,425 క్యూసెక్కులకు పరిమితం చేయడంతో పాటు లైనింగ్ పనులు చేపట్టేలా జీఓలు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లాకు చుక్క నీరు అందకుండా పోతుందని, అంతేకాక ఉమ్మడి జిల్లా మీదుగా కుప్పం ప్రాంతానికి నీళ్ల తరలించే కుట్రకు సీఎం చంద్రబాబు తెరలేపారన్నారు. రైతులకు జరిగే అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకూ ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందన్నారు. జేసీ ప్రభాకరరెడ్డి బస్సులను తగులబెట్టింది ఎవరో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి : ఎస్టీయూ


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఇన్‌చార్జ్ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ఇన్‌చార్జ్ సి.నాగరాజు, పరిశీలకులు గోకారి డిమాండ్ చేశారు. ఎస్టీయూ 78వ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నాగరాజు, గోకారి మాట్లాడుతూ... రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. మునిసిపల్ టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. జీఓ 84ను సవరించి బదిలీలు, పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టం రూపొందించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి జి.ప్రసాద్, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, శ్రీరాములు, జ్యోతి, సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్యఆచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిస్వార్థ సేవతోనే నిజమైన గుర్తింపు



డీఈఈ మధుసూదన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం సిటీ: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, రిటైర్మెంట్లు సహజమే. అయితే విధి నిర్వహణలో అందించిన నిస్వార్థ సేవలతోనే పది కాలాల పాటు అందరికీ గుర్తుండి పోతారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. అనంతపురం శివార్లలోని జీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) బి.మధుసూదన్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈ మధుసూదన్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి



క్యాలెండర్లను విడుదల చేస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురామ్

అనంతపురం టవర్‌క్లాక్: కురుబలు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని మాజీ మేయర్ రాగే పరుశురామ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన స్వగృహంలో కురుబ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాగే పరుశురామ్ మాట్లాడుతూ కురుబ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వెనుకబడిన కురుబలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. నూతనంగా ఎన్నికైన ఉద్యోగ సంఘం నాయకులు సేవా దృక్పథంతో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో బండి నాగమణి, పద్మావతి, నాగరాజు, వెంకటరాముడు, రామకృష్ణ, ఆదినారాయణ, నాగలింగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పడమటి గాలి' పుస్తకావిష్కరణ



పడమటి గాలి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: ఆంగ్ల కవిత్వాన్ని తెలుగులోకి శంకరనారాయణ అనుసృజన తీరు అద్భుతంగా ఉందని పలువురు వక్తలన్నారు. నగరానికి చెందిన ద్విభాషా కవి శంకరనారాయణ 'పడమటి గాలి' ఆంగ్లానువాద గ్రంథాన్ని ఆదివారం రాత్రి తపోవనంలోని వేదగాయత్రి మాత ఆలయంలో ఆవిష్కరించారు. డా. జగర్లపూడి శ్యామ సుందర శాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనప్రియ కవి ఏలూరు యంగన్న, డాక్టర్ పాణ్యం వసుంధర, డాక్టర్ గొల్లాపిన్ని సీతారామ్ ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. వర్డ్స్‌వర్త్, ఖలీల్ జిబ్రాన్, స్విన్ బర్న్, పీబీ షెల్లీ, డబ్ల్యూబీ ఈట్స్, జార్జ్ ఇలియట్, విలియం బ్లేక్, రాబర్ట్ ఫ్రాస్ట్ తదితర ప్రసిద్ధ ఆంగ్ల కవుల రచనలను స్వేచ్ఛానువాదం చేయడం సామాన్య విషయం కాదని అనంతమరో అద్భుత అనువాదకున్ని పొందడం అదృష్టమన్నారు. అనంతరం డాక్టర్ జగర్లపూడి శ్యామ సుందరశాస్త్రి ఆలపించిన పద్యాలు, కవితలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో రెండో సంవత్సరం చదువుతున్న చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురానికి చెందిన నారాయణస్వామి కుమారుడు కిరణ్ (19) రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తుండగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం: నగరం నుంచి కర్ణాటకకు తరలిస్తున్న మూడు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. చంద్ర ఆస్పత్రి వద్ద పోలీసు తనిఖీల్లో పట్టుబడినట్లు పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న పాతూరుకు చెందిన చంద్రను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

సంతల ఆదాయం రూ.4.18 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల నుంచి రూ.4.18 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు.

అధ్వానంగా అనంత రోడ్లు !

- గుంతలు పడ్డ రోడ్లకు ప్యాచ్ వర్కులు
- రూ.47 లక్షలతో 275 గుంతలు పూడ్చే పనులు
- కంకర వేసి వదిలేసిన వైనం
- నిద్రమత్తులో ఇంజినీరింగ్ అధికారులు



అధ్వానంగా ఉన్న లలిత కళాపరిషత్ రోడ్డు



సూర్యనగర్‌కు వెళ్లే దారి ఇలా..

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. గుంతలు పడ్డ రోడ్లకు ఆగమేఘాలపై మరమ్మతు పనులు చేసేందుకు రూ.లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోంది నగర పాలక సంస్థ. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.47 లక్షలు ప్యాచ్ వర్క్‌లకు కేటాయించారు. కానీ క్షేత్రస్థాయిలో పనులు పూర్తికాకపోవడంతో పాటు చాలా చోట్ల కంకర వేసి వదిలేశారు. అయినా ఇంజినీరింగ్ అధికారులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు.

275 ప్యాచ్ వర్కులు

నగరంలోని రోడ్లు గుంతలమయంగా మారాయి. విద్యుత్‌నగర్, సాయినగర్, హౌసింగ్ బోర్డు, ఆర్ఎఫ్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్డు, పాతూరు, రాంనగర్, లక్ష్మీనగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, సోమనాథ్‌నగర్, రంగస్వామినగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లు చాలా అధ్వానంగా తయారయ్యాయి. పాదచారులు, వాహనదారులు రోడ్లపై వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. చాలా సందర్భాల్లో కిందకు పడి గాయాల బారిన పడ్డ వారు చాలా మంది ఉన్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవడంలో ఇంజినీరింగ్ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. వాస్తవంగా నగరంలో రూ.13 కోట్ల పనులు జరగాల్సి ఉంటే రెండు పనులు మాత్రమే జరుగుతున్నాయి. నగరపాలక సంస్థలో ఏఈలు మొదలుకొని డీఈ, ఈఈలు, ఎస్ఈ వరకు ఆయారాం గయారాం అన్న చందంగా విధులు నిర్వర్తిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం అభివృద్ధి పనులు పరిశీలించలేని నిస్సహాయ స్థితిలో అధికారులున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నగర ప్రజలు ఇంటి, ఆస్తి పన్ను రూపేణ చెల్లించిన మొత్తంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. అలాంటి అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించకుండా ఇంజినీర్లు నిద్రమత్తులో ఉన్నారు. పనులు జాప్యం, నాణ్యత లోపిస్తున్నా అధికారులు అటువైపు తొంగి చూడటం లేదు.



రంగస్వామినగర్ - సోమనాథ్‌నగర్‌లో ప్యాచ్‌వర్కు పనులు అధ్వానంగా చేపట్టిన దృశ్యం



పాతూరుకు వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి

రాళ్లు మీద పడుతున్నాయి



గుంతలు పడ్డ రోడ్డులో కంకర వేసి వదిలేశారు. సోమనాథ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో రోజూ వేల వాహనాలు వెళ్తుంటాయి. కంకర్‌పై వాహనాలు వెళ్లినప్పుడు రాళ్లు ఎగిరి మీద పడుతున్నాయి. పొరపాటున కంటికి, తలలోని సున్నితమైన చోట తగిలితే ప్రాణానికే ప్రమాదం. గుంతలను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– ఖాజా, సోమనాథ్‌నగర్

అధికారులు స్పందించాలి



ప్రజాప్రతినిధులు, కలెక్టర్, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు ఇదే రోడ్లపై తిరుగుతుంటారు. ఇక్కడున్న గుంతలరోడ్లను వారు చూస్తూనే ఉంటారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు బాగుండేలా చూడాలి. కనీసం రోడ్లు కూడా సరిగా వేయించకపోతే ఎలా? అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– హరి, మానవ హక్కుల సంఘం ప్రతినిధి

పడితే ఎవరు దిక్కు ?



రోజూ నగర రోడ్లపై వాహనంలో వెళ్తుంటా. రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. దడ దడ అంటూ వెళ్లాల్సి వస్తోంది. గుంతల్లో వెళ్తున్నప్పుడు పొరపాటున కిందకు పడితే దిక్కెవరు. వృద్ధాప్యంలో చేయి, కాలు విరిగితే ఎవరు పట్టించుకుంటారు? అధికారులు స్పందించి రోడ్లను బాగా ఏర్పాటు చేయాలి. నగరం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రోడ్లను ఏర్పాటు చేయాలి.
– మహేష్, తపోవనం

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో పాల్గొన్న అదనపు జిల్లా జడ్జి సత్యవాణి

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవల్లి , దేవసేన ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలు ధరింపజేసి వేదపండితుల శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తాదులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

స్వామిని దర్శించుకుని అదనపు జిల్లా జడ్జి

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అనంతపురం అదనపు జిల్లా జడ్జి సత్యవాణి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బందికి ఆమెకు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ ఈఓ బాబు జిల్లా జడ్జి సత్యవాణికి స్వామి వారి చిత్ర పటాన్ని అందించారు.

నేడు పింఛన్ల పరిశీలన

- ఆందోళనలో లబ్ధిదారులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అభాగ్యుల నోరు కొట్టేందుకు రంగం సిద్ధమైంది. గతంలో వైద్యులు ధ్రువీకరించిన వికలాంగుల సర్టిఫికెట్లను తప్పుబడుతూ పింఛన్ వెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. సోమవారం అనంతపురం అర్బన్‌లో వైద్య బృందం, సచివాలయ ఉద్యోగులు పింఛన్ వెరిఫికేషన్ చేపట్టనున్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, సర్టిఫికెట్లు, ఆధార్ తదితర వాటిని పరిశీలించి పింఛన్‌కు కోత వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఆరుగురు వైద్యుల బృందం

పింఛన్ వెరిఫికేషన్‌కు కర్నూలు బోధనాస్పత్రి నుంచి ఆరుగురు వైద్యులతో పాటు సచివాలయ ఉద్యోగులు బృందంగా 74 సచివాలయాల పరిధిలో ఉన్న 122 మంది పింఛన్ లబ్ధిదారులు (డిసబులిటీ) ఇళ్ల వద్దకు వెళ్లనున్నారు. సోమవారం తప్పక అందుబాటులో ఉండాలని, లేకపోతే పింఛన్‌కు ఎసరు తప్పదని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

50 నుంచి 80 పింఛన్లకు కోత

పింఛన్ వెరిఫికేషన్‌లో 50 నుంచి 80 మందికి పింఛన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతున్నట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ కీలక అధికారులే స్వయంగా పింఛన్లను కుదించాలని అందరూ పకడ్బందీగా విచారణ చేయాలని సచివాలయ సిబ్బందికి చెప్పడం చర్చనీయాంశమవుతోంది.

సీఎం చంద్రబాబు హామీలను నిలబెట్టుకోవాలి



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 7న జరగనున్న జిల్లా మహా సభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా మహా సభలు జయప్రదం చేయాలంటూ సమాఖ్య నాయకులు ఆదివారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో ఈనెల 7న ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. మెగా డీఎస్సీతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలిపారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, జిల్లాలో నూతన పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు 70 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వీటన్నింటిపై మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

8వ వేతన సంఘం సమస్యపై పార్లమెంట్‌లో చర్చించండి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రికి తపాలా ఉద్యోగుల వినతి



కేంద్ర మంత్రి సోమన్నకు వినతిపత్రం ఇస్తున్న తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి

అనంతపురం సిటీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఎనిమిదో వేతన సవరణ సమస్యను పరిష్కరించేలా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి, బిల్లు పాస్ అయ్యేలా చొరవ తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్(ఏఐజీడీఎస్‌యూ) అనంతపురం డివిజన్ కార్యదర్శి పి.కృష్ణయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు ఆదివారం విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కలసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన వేతనాలు, పెన్షన్ల సవరణ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదన్నారు. వేతన సవరణకు మరో ఏడాది మాత్రమే గడువు ఉండడంతో ఇప్పటి నుంచే ఆ ప్రక్రియ మొదలు పెట్టేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అనంతరం విలేకరులకు కృష్ణయ్య వివరించారు.

ఆరోగ్య సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం: ఆరోగ్య సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) క్రీడా మైదానంలో మాస్టర్స్ అసోసియేషన్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ మా (మాస్టర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలు అన్ని వయసుల వారికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు, ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, వైద్యులు డాక్టర్ కొండయ్య, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, మా (మాస్టర్స్ అసోసియేషన్) అధ్యక్షుడు కే. సుధాకర్‌బాబు, కార్యదర్శి సికిందర్ పాల్గొన్నారు. తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఒంటికొండ చంద్రమోహన్ 100, 800 మీటర్ల పరుగుపందెంలో కాంస్య, షార్ట్‌పుట్‌లో కాంస్య పతకాలను సాధించారు. అలాగే అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ మూడు విభాగాల్లో రజత పతకాలు సాధించారు.

అనంత వెంకటరెడ్డికి ఘన నివాళి



దివంగత ఎంపీ అనంత వెంకటరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



అనంత వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా అనంతపురంలో అన్నదానం

బుక్కరాయసముద్రం: అనంతపురం మాజీ ఎంపీ, దివంగత అనంత వెంకటరెడ్డి జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని అనంతపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న అనంత వెంకటరామిరెడ్డి తోటలో అనంత వెంకటరెడ్డి 25వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన కుమారులైన అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుబ్బారెడ్డి, అనంత చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద ప్రముఖులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంత వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, ఓబిరెడ్డి, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి, సైపుల్లాబేగ్, చంద్రశేఖర్‌యాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, అశ్వర్థనాయక్, అనిల్‌కుమార్‌గౌడ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌బేగ్, రాధాకృష్ణ, చిత్రా వెంకటేష్, జానీ, ఇసాక్, తనీష, సాధిక్, మేదర కృష్ణ, చింతకుంట మధు, ఆలమూరు సుబ్బారెడ్డి, నాగార్జున రెడ్డి, జావెద్, భారతి, శోభారాణి, శోభాబాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

అనంతపురం కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 11న భగవద్గీతలోని 12వ అధ్యాయంపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద యోగకేంద్ర అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి తెలిపారు. 12వ తేదీ ఉదయం 8 గంటలకు అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కు వేదికగా విశ్వశాంతికి భారతీయ సంస్కృతి సంప్రదాయాల పాత్ర' అనే అంశంపై వక్తృత్వ పోటీలు, అలాగే యోగాసన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఆదివారం సరస్వతీ విద్యాపీఠం ప్రాంగణంలో 'వివేకానందుని ప్రబోధాత్మక సందేశాలు–జీవిత చరిత్ర' అనే అంశంపై జరిగిన పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు 11, 12 తేదీలలో సాగే పోటీలలో పాల్గొనడానికి 9440288899, 9963028694 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా సద్గురువుల శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: జగద్గురు పరమహంస యోగదా సత్సంగ మండలి ఆధ్వర్యంలో జగద్గురు యోగానంద చిత్రపటంతో ఆదిమూర్తినగర్‌లోని ధ్యాన మండలి నుంచి భజనలు చేస్తూ ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విశ్వగురువులు యోగానంద మహారాజ్ విలక్షణ జీవిత విశేషాలను గురించి సంస్థ ప్రతినిధులు వివరించారు. ఆ సంఘం ప్రతినిధులు నరసింహులు, సాయిప్రసాద్, చంద్రశేఖర్, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కార వేదిక 'భగవద్గీత'

అనంతపురం కల్చరల్: సకల సమస్యల పరిష్కారమార్గమైన భగవద్గీత ప్రతి చిన్నారి నోటి వెంట వినపడేలా చేయాలని అప్పుడే విలువలతో కూడిన సమాజ స్థాపన సాధ్యమవుతుందని భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధరశాస్త్రి అన్నారు. గీతా ప్రచారంలో భాగంగా జిల్లాకొచ్చిన ఆయన ఆదివారం మూడోరోడ్డులోని ఘంటసాల భవన్‌లో భగవద్గీత ప్రచారకులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి

అనంతపురం కల్చరల్: నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో ఆదివారం సుబ్రహ్మణ్య షష్టిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే పూజాకర్తలు తలుపుల నాగేంద్ర ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకార సేవలు నిర్వహించారు.వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్, విశ్వనాథ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.